జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా

సంపుటి - 07 | సంచిక 330 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 01, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

రాష్ట్రంలో నేరాలు నియంత్రించబడాలి

డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

- సైబర్ నేరాల నిర్మూలనకు ముమ్మరం అవుతున్న సర్వ ప్రయత్నాలు
- సైబర్ నేరగాళ్ల భరతం పడుతున్న రాష్ట్ర పోలీస్ శాఖ
- సాంకేతిక నైపుణ్యం కలిగిన వాళ్ళే సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు
- ప్రధాన పట్టణాలలో నేరగాళ్ళ సంఖ్య పెరిగిపోయింది
- రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న సైబర్ నేరస్తుల నేర చరిత్ర
- ఫ్లాష్ వాక్ కార్యక్రమాలతో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు
- పోలీస్ అమరవీరుల వారోత్సవాలు రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తున్నాయి
- పోలీస్ అమరవీరుల ఆశయాలను సాధించడం కోసం ప్రతి ఒక్కరూ సంసిద్ధులవుతున్నారు
- పోలీస్ అధికారుల నిజాయితీ మాత్రమే సైబర్ నేరగాళ్లకు వనకు పుట్టిస్తుంది
- రాష్ట్ర డిజిపి సీవీ ఆనంద్ ఐపీఎస్ వ్యూహరచనలు అమోఘం
- డాక్టర్ బరిగెల శివ



తెలంగాణలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయాలని డాక్టర్ బరిగెల శివ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజల బ్యాంకు ఖాతాలను కొల్లగొడుతున్న మోసగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ లింకులు, బల్క్ సందేశాలు, మోసపూరిత ఫోన్ కాల్స్ ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన తక్కువగా ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిరంతర నిఘా, ప్రత్యేక శిక్షణ అవసరమని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజా అవగాహన కార్యక్రమాలను అభినందించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలు అందించాలని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ రికార్డుల భద్రత, సమాచార మార్పులపై కూడా ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని తెలిపారు. సైబర్ మోసాలకు పాల్పడే వ్యక్తులతో పాటు ప్రభుత్వ రికార్డులను అక్రమంగా తారుమారు చేసే వారిపైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

అమిత్ షా పాదయాత్ర పోస్టర్ విడుదల

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ
నవంబర్ 2న హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర
నిజాం కళాశాల నుంచి ఎంజే మార్కెట్ వరకు యాత్ర
పోస్టర్‌ను విడుదల చేసిన కిషన్ రెడ్డి, రాంచందర్ రావు
లక్ష మంది జనసమీకరణే లక్ష్యంగా బీజేపీ కార్యాచరణ

హైదరాబాద్, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్) :

నవంబర్ 2న హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్వహించనున్న పాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర విపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టేందుకు బీజేపీ 'లోక్‌తంత్ర బచావో - అరాచకత్వ హటావో' పేరుతో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని నిజాం కళాశాల నుంచి ఎంజే మార్కెట్ వరకు అమిత్ షా పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి లక్ష మంది ప్రజలను సమీకరించాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. పాదయాత్ర మార్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఇతర పార్టీ నేతలు పరిశీలించి, ఏర్పాట్లపై సమీక్షించారు.

ఘనంగా రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్.ఎస్. రాజు జన్మదిన వేడుకలు

అనసూయ టవర్స్‌లో అంగరంగ వైభవంగా జన్మదిన సంబరాలు
ముఖ్య అతిథిగా రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్
జై భీమ్ టీవీ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ బరిగెల శివతో పాటు సుమారు 250 మంది హాజరు

2

నేరాల నివారణకు 'కమ్యూనిటీ కనెక్ట్'

ప్రజల వద్దకే వెళ్లి అవగాహన కల్పిస్తాం: వరంగల్ సీపీ ఎన్. శ్వేత

3

ఇస్రో శాస్త్రవేత్తలకు సీఎం రేవంత్ అభినందనలు

జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 ప్రయోగం విజయవంతంపై హర్షం
ఎన్‌వీఎస్-03 ఉపగ్రహం నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశం
భారత నావిగేషన్ సామర్థ్యాలకు మరింత బలం
కీలక రంగాల్లో మెరుగైన సేవలు అందించనున్న ఉపగ్రహం
ఇస్రోకు మరిన్ని విజయాలు రావాలని సీఎం ఆకాంక్ష

హైదరాబాద్, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్) :

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టడం భారత నావిగేషన్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే కీలక మైలురాయి అని ప్రశంసించారు. రవాణా, విమానయానం, సముద్ర మార్గాల గుర్తింపు, పర్యవేక్షణ, అత్యవసర సేవలు వంటి కీలక రంగాల్లో ఎన్‌వీఎస్-03 మెరుగైన సేవలు అందించనుందని పేర్కొన్నారు. ఈ విజయం యావత్ దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

హన్మకొండ, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

వరంగల్ ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో మాజీ పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి తదితరులు సమావేశమయ్యారు. హన్మకొండలోని బోయినపల్లి వినోద్ కుమార్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు కార్యక్రమంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఎవరూ ఓటరు నమోదుకు దూరం కాకుండా చూడాలని, ఓటరు నమోదు ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రుల సమస్యలు, హక్కులు, ఆకాంక్షలకు ప్రాధాన్యత కల్పించాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు భాగస్వామి కావాలని వారు పిలుపునిచ్చారు. వరంగల్ ట్రైసిటీస్ పరిధిలోని అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న పట్టభద్రులు, ఉద్యోగులు, యువతకు ఓటరు నమోదు కార్యక్రమంపై సమాచారం అందించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా కృషి చేయాలని కోరారు. పట్టభద్రుల హక్కుల పరిరక్షణకు, వారి గొంతుకను శాసనమండలిలో బలంగా వినిపించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

నాలుగు దశాబ్దాలకు పైగా సేవలందించిన జోనాకు ఘన వీడ్కోలు

ఉద్యోగ విరమణ సహజమే.. సంస్థకు చేసిన సేవలు చిరస్మరణీయం.. కమిషనర్ టి. వెంకన్న

అదనపు కమిషనర్ ఇసాంపల్లి జోనా, పారిశుద్ధ్య కార్మికుడు కుమార్‌కు ఘన సన్మానం

వరంగల్, 31 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో సహజమైన పరిణామమే అయినప్పటికీ, విధి నిర్వహణలో చూపిన అంకితభావం, సంస్థ అభివృద్ధికి అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అన్నారు. ఉద్యోగులు ఏ హోదాలో పనిచేసినా సంస్థ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో విలువైనదని పేర్కొన్నారు.జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం పదవీ విరమణ పొందిన అదనపు కమిషనర్ ఇసాంపల్లి జోనా, పారిశుద్ధ్య కార్మికుడు కుమార్‌లకు జీడబ్ల్యూఎంసీ, జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌తో పాటు అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ మున్సిపల్ శాఖలో వివిధ హోదాల్లో సుమారు 44 సంవత్సరాల పాటు సేవలందించిన ఇసాంపల్లి జోనా సుదీర్ఘ అనుభవం, అంకితభావం అభినందనీయమన్నారు. సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో అనేక బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్నత స్థాయికి ఎదగడం ఆయన వృత్తిపట్ల చూపిన నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు.అదేవిధంగా నగర పారిశుద్ధ్య నిర్వహణలో క్షేత్రస్థాయిలో పనిచేసే కార్మికుల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు. నగర ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికుల శ్రమ ఎంతో కీలకమని, ప్రతి ఉద్యోగి అందించే సేవలను సంస్థ గుర్తించాలని అన్నారు. ఉన్నతాధికారి నుంచి క్షేత్రస్థాయి కార్మికుడి వరకు ప్రతి ఒక్కరి కృషి సంస్థకు ముఖ్యమని స్పష్టం చేశారు.ఉద్యోగ విరమణతో విధుల నుంచి మాత్రమే విరామం లభిస్తుందని, జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని, వీలైనంతవరకు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్ రెడ్డి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వర్ రావు, ఉప కమిషనర్లు సమ్మయ్య, బిర్రు శ్రీను, ప్రసన్న రాణి, జేఏసీ సభ్యులు బాకం సంతోష్, సర్జన రాజు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నేరాలు నియంత్రించబడాలి

సైబర్ నేరాల నిర్మూలనకు ముమ్మరం అవుతున్న సర్వ ప్రయత్నాలు

సైబర్ నేరగాళ్ల భరతం పడుతున్న రాష్ట్ర పోలీస్ శాఖ

సాంకేతిక నైపుణ్యం కలిగిన వాళ్ళే సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు

ప్రధాన పట్టణాలలో నేరగాళ్ళ సంఖ్య పెరిగిపోయింది

రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న సైబర్ నేరస్తుల నేర చరిత్ర

ఫ్లాష్ వాక్ కార్యక్రమాలతో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు

పోలీస్ అమరవీరుల వారోత్సవాలు రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తున్నాయి

పోలీస్ అమరవీరుల ఆశయాలను సాధించడం కోసం ప్రతి ఒక్కరూ సంసిద్ధులవుతున్నారు

పోలీస్ అధికారుల నిజాయితీ మాత్రమే సైబర్ నేరగాళ్లకు వనకు పుట్టిస్తుంది

రాష్ట్ర డిజిపి సీవీ ఆనంద్ ఐపీఎస్ వ్యూహరచనలు అమోఘం : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

తెలంగాణ రాష్ట్రంలో అధిక సంఖ్యలో పెరిగిపోతున్న సైబర్ నేరాలను సైబర్ నేరగాళ్లను అరికట్టి భరతం పట్టడానికి రాష్ట్ర పోలీస్ శాఖ కొత్త రకమైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలను అందిస్తుందని డాక్టర్ బరిగెల శివ ప్రత్యేక సందర్భంగా అభినందించారు . సైబర్ మోసాల బారీన పడిన ప్రజలు తీవ్రంగా నష్టపోతు రికవరికి నోచుకోక అనేక రకాల మదన పడుతున్నారని అన్నారు. సాధారణ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులు సామర్థ్యం పెంచుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని దానిని రాష్ట్ర ప్రజలు సాంకేతిక కోణంలోనే ఎదుర్కొని రాష్ట్ర పోలీస్ శాఖ సూచిస్తున్న సూచనలను అనుసరిస్తూ సైబర్ నేరగాళ్ల చేతుల్లో చిక్కకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతుండగా రాష్ట్రవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడంతో కొంతమంది చదువుకున్న వ్యక్తులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకొని సునాయసమైన మార్గంలో డబ్బును సంపాదించుకోవడం కోసం సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని వాటిపై రాష్ట్ర పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు నిఘా వేస్తూ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను పట్టణ ప్రాంతంలోని వ్యవస్థలను అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బ్యాంకులలో నిలువ చేసుకుంటున్న సొమ్ము రహస్యంగా ఉంచబడుతున్నప్పటికిని ప్రతి వ్యక్తి బ్యాంకుల వివరాలు సైబర్ నేరగాళ్లకు సునాయాసంగా తెలిసిపోతున్నాయని గుర్తు చేశారు. సాంకేతిక లింకులను బల్క్ మెసేజ్ ల ద్వారా ప్రజలకు పంపిస్తూ వాటి ద్వారా రహస్యంగా డబ్బులను కాజేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వృద్ధులను మహిళలను టార్గెట్ చేసుకుంటూ బ్యాంకు ఖాతాలను తెలుసుకొని వాటి ఆధారంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు రాష్ట్ర గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు.

సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ఉక్కు పాదం..

రాష్ట్రాన్ని తప్పుదోవ పట్టించడానికి సైబర్ నేరగాళ్లు చేస్తున్న ప్రయత్నాలు ముమ్మరం అవుతున్న సందర్భంగా రాష్ట్ర పోలీస్ శాఖ సైబర్ నేరగాళ్ల భరతం పడుతూ లోతైన అధ్యయనంతో లోతైన సాంకేతిక పరికరాల సహాయంతో సైబర్ నేరగాళ్ళను మట్టి కరిపిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పోలీస్ శాఖ శాంతి భద్రతల రక్షణ కోసం ఏ విధంగానైతే తీవ్రంగా శ్రమిస్తున్నారో అంతకు పైరేట్లుగా సైబర్ మోసగాళ్లకు చాకచక్యంగా పట్టుకుంటున్నారని అభినందించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర డిజిపి సీవి ఆనంద్ ఐపీఎస్ రాష్ట్ర పోలీస్ శాఖ బాధ్యతలు చేపట్టాక సైబర్ నెరగాళ్ళను , క్రైమ్ నేరగాళ్లను ఎక్కడికక్కడ అణిచిచేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉన్నతాధికారుల క్రైమ్ సమావేశాలలో రాష్ట్ర డిజిపి పోలీసు ఉన్నతాధికారులకు సైబర్ నేరాల నియంత్రణ కోసం సూచిస్తున్న దిశా నిర్దేశ మార్గాలు పోలీస్ శాఖను తెలంగాణ రాష్ట్రంలో ప్రభావితవంతంగా నడిపిస్తున్నట్లుగా ప్రజలు భావిస్తున్నారన్నారు. క్రైమ్ నేరాలతో పాటు సైబర్ నేరాలు పెరగడానికి గల ప్రధాన కారణం యువత జల్సాలకు అలవాటు పడుతూ వాళ్ళు చదువుకున్న విద్యను సాంకేతిక పరమైన దోపిడీకి ఉపయోగిస్తున్నారని గుర్తు చేశారు. సైబర్ నేరాలలో క్రైమ్ నేరాల్లో చిక్కుకున్న నేరస్థులంతా ఎక్కువ శాతం యువతేనంటూ తెలియజేశారు. రాష్ట్ర పోలీస్ శాఖ సూచిస్తున్న మార్గదర్శకాలను పాటిస్తున్న ప్రతి వ్యక్తి సైబర్ నేరాల నుండి తప్పించుకుంటూ ఎప్పటికప్పుడు అప్రమత్తం అవుతున్నారని తెలియజేశారు.

పోలీసుల అమరవీరుల వారోత్సవాలు అద్భుతం..

తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ అమరవీరుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయని గర్వంగా చెప్పారు. పోలీస్ అమరవీరుల ఆశలను నెరవేర్చడం కోసం పోలీసుల సేవలు ప్రజలకు మరింత చేరువ అయ్యే విధంగా ప్రజలతో మమేకమవుతూ పోలీస్ అమరవీరుల ఆశయాలు ఎంత గొప్పగా ఉంటాయో వారం రోజుల పాటుగా జరుగుతున్న కార్యక్రమాలతో రాష్ట్ర ప్రజలకు తెలియజేస్తున్నారన్నారు. అందులో భాగంగానే పోలీస్ అమరవీరుల కుటుంబాలను ప్రధాన పోలీస్ కార్యాలయానికి ఆహ్వానిస్తూ పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తూ వాళ్ళను గౌరవించుకొని వాళ్ల కుటుంబాలకు పోలీస్ శాఖ పరంగా కావలసిన ప్రతి అవసరాలను సకాలంలో అందించబడే విధంగా సహాయ సహకారాలు అందిస్తూ పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాల సాక్షిగా ప్రతి పోలీసు ఉన్నతాధికారి వాళ్ళ శాఖల పరిధిలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రాష్ట్రాని, దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని గర్వపడ్డారు. ఒకవైపు పోలీస్ శాఖ రాష్ట్రంలో నవీనమైన సేవ మార్గాలను ఏర్పాటు చేయడం కోసం పోలీస్ అమరవీరుల వారోత్సవాల సాక్షిగా సేవలందించడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తుంటే మరోవైపు రాష్ట్ర పోలీస్ శాఖను సవాల్గా తీసుకుంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలను సామాన్యులను దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు .

సైబర్ మోసాలు సర్వత్రా విస్తరిస్తున్నాయి..

ఒకవైపు సైబర్ నేరగాళ్లు వాళ్ల ఆగడాలను నిత్యం కొనసాగిస్తుండగా రాష్ట్రంలో పోలీస్ శాఖకు మరో రకమైన కొత్త సవాళ్లు సాంకేతిక సైబర్ రూపంలో ఎదురవుతున్నాయని గుర్తు చేశారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వ శాఖల లోని అధికారులు అధికార కార్యాలయాలలో వాళ్లు కొనసాగిస్తున్న విధులలో రికార్డులపరమైన ట్యాంపరింగ్లకు పాల్పడుతూ నిజ ఆధారాలను తారుమారు చేస్తూ అక్రమాలకు అవినీతిలకు అనుకూలమైన తప్పుడు నివేదికలను తప్పుడు ఆర్డర్లను సిద్ధపరచుకొని ప్రభుత్వ వ్యవస్థ పరమైన సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ముఖ్యంగా ఈ మధ్యకాలంలో చాలా ప్రాంతాల్లో పోలీస్ అధికారులు ప్రభుత్వ శాఖలపై దాడులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఉన్నత స్థాయిలో ఏర్పడుతున్నాయని విజిలెన్స్ అధికారుల రూపంలో టాస్క్ ఫోర్స్ అధికారులు సైబర్ క్రైమ్స్ అధికారులకు సిసిఎస్ బ్రాంచ్ అధికారులకు ప్రభుత్వ వ్యవస్థలను తప్పుడు రికార్డుల మార్గంలో నడిపిస్తున్న అధికారులపై రైడ్స్ నిర్వహిస్తూ చర్యలు చేపడుతున్నారని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా సైబర్ నేరగాళ్ల రూపంలో వెలుగులోనికి వస్తున్న నేరాలకు పోలీస్ అధికారుల ద్వారా కఠిన శిక్షలు పడుతున్నాయి కానీ ప్రభుత్వ వ్యవస్థలను దోచుకునే సైబర్ అధికారులకు శిక్షలు పడడం లేదని గుర్తుచేశారు. సైబర్ నేరాలు అంటే శాఖ పరిధిలోనికి వచ్చే నేరాలను పరిగణలోనికి తీసుకొని వాటిని నియంత్రిస్తూ వాటిని నిర్మూలిస్తూ సైబర్ నేరగాళ్లను పట్టుకొని శిక్షిస్తున్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వ్యవస్థలలో ముఖ్యంగా విద్యాశాఖ ఆరోగ్య శాఖ రెవెన్యూ శాఖ మున్సిపల్ శాఖ చివరకు పోలీస్ శాఖలో కూడా రహస్యంగా జరుగుతున్న అంతర్గత సైబర్ ఆధారాల వల్ల ఆయా శాఖలు ప్రజలకు సేవలు అందించబడకుండా ప్రజలను ప్రభుత్వ సేవలకు దూరం చేస్తున్నాయని దాని కారణంగా సైబర్ నేరాలు ప్రభుత్వ వ్యవస్థలలో రహస్యంగా జరుగుతున్నాయని వాటన్నిటిపై రాష్ట్ర పోలీస్ బాస్ సీవి ఆనంద్ ఐపీఎస్ తనదైన శైలిలో ప్రభుత్వ కార్యాలయ ఆగడాలపై దూకుడు పెంచి పోలీస్ శాఖతో ప్రజలకు ఏ విధంగానైతే సేవలు అందిస్తున్నారో ప్రభుత్వ వ్యవస్థలు కూడా ప్రజలకు అదేవిధంగా సేవలు అందించబడడానికి ప్రత్యేక కార్యాచరణలు నిర్మించుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాల సైబర్ మోసాలను ఎండగట్టాలని అలాంటి అధికారుల భరతం పట్టాలని కోరారు.

ఘనంగా రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్.ఎస్. రాజు జన్మదిన వేడుకలు

అనసూయ టవర్స్‌లో అంగరంగ వైభవంగా జన్మదిన సంబరాలు

ముఖ్య అతిథిగా రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్

జై భీమ్ టీవీ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ బరిగెల శివతో పాటు సుమారు 250 మంది హాజరు

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

స్నేహబంధాలు, ఆత్మీయతలు,అభిమానుల అభినందనల మధ్య రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ ఫౌండర్, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజు జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌లోని తార్నాక అనసూయ టవర్స్‌లో నిర్వహించిన ఈ వేడుకలు ఆద్యంతం ఆనందోత్సాహాలతో సాగాయి. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ఆప్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. సుమారు 250 మంది హాజరైన ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ముఖ్య అతిథిగా రాష్ట్ర సమాచార కమిషనర్

ఈ జన్మదిన వేడుకలకు రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్. రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని, వ్యాపార రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

డాక్టర్ బరిగెల శివ ప్రత్యేక హాజరు

ఈ కార్యక్రమంలో జై భీమ్ టీవీ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ పాల్గొని ఎస్.ఎస్. రాజుకు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని పంచుకున్నారు. స్నేహం, మంచితనం, పరస్పర గౌరవం జీవితంలో ఎంతో విలువైనవని, ఆప్తుల మధ్య ఇలాంటి వేడుకలు నిర్వహించుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

250 మందితో ఘనమైన సంబరాలు

జన్మదిన వేడుకల్లో భాగంగా ఎస్.ఎస్. రాజు కేక్ కట్ చేయగా, అతిథులందరూ చప్పట్లతో శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛాలు అందిస్తూ, శాలువాలతో సత్కరిస్తూ తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వ్యాపారవేత్తలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఒకే వేదికపై కలుసుకోవడంతో కార్యక్రమం సందడిగా సాగింది.

సిబ్బంది సందడి

రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ సంస్థ సిబ్బంది రజిని, స్నేహ, నీరజ, సతీష్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని తమ అధినేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ అభివృద్ధిలో యాజమాన్యం, సిబ్బంది మధ్య ఉండే అనుబంధం, సమన్వయం, పరస్పర సహకారం కీలకమని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

ఆత్మీయతకు అద్దం పట్టిన వేడుకలు

జీవితంలో సంపాదించే సంపదతో పాటు మనుషుల హృదయాల్లో సంపాదించుకునే అభిమానం, గౌరవం ఎంతో గొప్పవని ఈ వేడుకలు చాటిచెప్పాయి. సుమారు 250 మంది ఒకచోట చేరి ఎస్.ఎస్. రాజుపై తమకున్న అభిమానాన్ని వ్యక్తం చేయడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతగా నిలిచింది. రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని, ఎస్.ఎస్. రాజు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. తన జన్మదిన వేడుకలకు విచ్చేసి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్, డాక్టర్ బరిగెల శివ, సంస్థ సిబ్బంది, కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ఆప్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులందరికీ ఎస్.ఎస్. రాజు కృతజ్ఞతలు తెలిపారు.

గౌడ సంఘం పేరు చెప్పి గెలిచి.. సంఘం భూములకే ఎసరు పెట్టారా?

879, 880, 925 సర్వే నంబర్ల భూములపై వివాదం
సంఘం పేరుతో పదవులు పొంది.. వ్యక్తిగత పట్టాలుగా మార్చుకున్నారంటూ ఆరోపణలు
వాస్తవాలు నిగ్గు తేల్చి సంఘం భూములను కాపాడాలని ఆర్డీవోకు వినతి

ఐనవోలు: (జై భీమ్ న్యూస్)

గౌడ సంఘం పేరు చెప్పుకొని నాయకులుగా ఎదిగి, సంఘం సభ్యుల మద్దతుతో పదవులు పొంది, చివరకు అదే సంఘానికి సంబంధించిన భూముల విషయంలో వివాదాలకు కారణమవుతున్నారా? సంఘం ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కలిగిన వారే వాటిపై వ్యక్తిగత హక్కులు కల్పించుకునే ప్రయత్నం చేస్తున్నారా? ఐనవోలు మండల కేంద్రంలో గౌడ సంఘానికి సంబంధించిన భూముల వివాదం ప్రస్తుతం ఈ ప్రశ్నలను లేవనెత్తుతోంది. మండల కేంద్రంలోని గౌడ సంఘానికి సంబంధించిన 879, 880, 925 సర్వే నంబర్లలో ఉన్న భూముల వ్యవహారం తాజాగా మరోసారి తెరపైకి వచ్చింది. గతంలో గౌడ సంఘం పేరు, సంఘం ప్రతిష్ఠను ఉపయోగించుకొని ఎన్నికల్లో గెలుపొందిన కొందరు వ్యక్తులే ఇప్పుడు సంఘానికి సంబంధించిన భూములను తమ వ్యక్తిగత ప్రయోజనాలకు అనుగుణంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారనే తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంఘం పేరు చెప్పుకొని సభ్యుల విశ్వాసాన్ని పొందిన వారు, సంఘం ఆస్తులను కాపాడాల్సింది పోయి సంబంధిత భూములను అక్రమంగా వ్యక్తిగత పట్టాలు చేయించుకున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంతో అసలు హక్కుదారులైన సంఘ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంఘం ఆస్తులు సమాజ ప్రయోజనాలకు ఉపయోగపడాల్సి ఉండగా, కొందరి వ్యక్తిగత ప్రయోజనాలకు వేదికగా మారుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారా?

భూముల వివాదానికి సంబంధించి వాస్తవ పరిస్థితులను అధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా, తమకు అనుకూలమైన అంశాలను మాత్రమే వివరిస్తూ విచారణను పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న సంఘం సభ్యుల వ్యవహారశైలిపై ఫిర్యాదుదారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన పరిణామాలు, భూముల అసలు స్వరూపం, పట్టాల జారీకి సంబంధించిన ఆధారాలను సమగ్రంగా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కోట నిఖిల్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి, సర్వే నంబర్లు 879, 880, 925లోని భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

సంఘం ఆస్తులు ఎవరి సొత్తు?

సంఘం పేరు మీద నాయకత్వం వహించే వారికి ఆస్తులపై వ్యక్తిగత హక్కులు కల్పించుకునే అధికారం ఉందా? సంఘం సభ్యుల సమ్మతి లేకుండా భూముల విషయంలో నిర్ణయాలు తీసుకోవచ్చా? పట్టాలు ఎలా వచ్చాయి? వాటి వెనుక ఉన్న దరఖాస్తులు, ఆధారాలు ఏమిటి? అప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన లావాదేవీలపై విచారణ జరగాల్సిన అవసరం ఉందని ఫిర్యాదుదారులు కోరుతున్నారు. ముఖ్యంగా సంబంధిత భూములపై రెవెన్యూ రికార్డులు, పట్టాల జారీ ప్రక్రియ, సంఘం తీర్మానాలు, పాత రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే భూములపై హక్కుల వివాదం తేలేవరకు తదుపరి లావాదేవీలు జరగకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంఘం ఐక్యతకు పరీక్షగా మారిన భూ వివాదం

ఒక సంఘం బలం దాని నాయకుల్లో కాదు.. సభ్యుల ఐక్యతలో ఉంటుంది. సంఘం ఆస్తులు వ్యక్తుల ఆస్తులు కావు. వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుంది. నాయకత్వం కోసం సంఘం పేరు ఉపయోగించుకొని, ఆస్తుల విషయంలో మాత్రం వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు నిజమైతే అది సభ్యుల విశ్వాసానికి విరుద్ధమే అవుతుంది. అయితే ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం స్పందించి 879, 880, 925 సర్వే నంబర్ల భూములపై నిష్పక్షపాత విచారణ జరిపి, సంఘం ఆస్తుల విషయంలో నెలకొన్న అనుమానాలకు తెరదించుతుందా? లేక ఈ వివాదం మరింత ముదురుతుందా? అన్నది వేచి చూడాలి. ఈ కార్యక్రమంలో నకరకంటి మోహన్, కోట నర్సయ్య, నకరకంటి రవీందర్, బైరి వెంకటయ్య, గంగి ఎల్లయ్య, గాని మల్లేశ్, మునిగాల మొగిలి, బొల్లెపెల్లి రమేష్, తిగల చంద్రశేఖర్, కోట నిఖిల్, బొల్లెపెల్లి రఘువర్మ, బొల్లెపెల్లి మధు, బొల్లెపెల్లి తిరుపతి, బొల్లెపెల్లి యాదగిరి, బొల్లెపెల్లి నర్సయ్య, బొల్లెపెల్లి సతీష్, నకరకంటి రమేష్, ఏ. అగపాటి ఉప్పలయ్య, తాళ్లపల్లి మల్లేశం, తిగల రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లాభాయ్ పటేల్ సేవలు దేశానికి గర్వకారణం

వరంగల్ సీపీ ఎన్. శ్వేత, ఐపీఎస్

వరంగల్, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

సర్దార్ వల్లాభాయ్ పటేల్ దేశ సమగ్రత, ఐక్యత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అన్నారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఆయన చిత్రపటానికి సీపీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానంతరం దేశంలోని సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ వల్లాభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. దేశ ఐక్యతకు, సమగ్రతకు ఆయన వేసిన పునాది చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. పటేల్‌ను 'ఉక్కు మనిషి'గా పేర్కొంటూ, ఆయన ఆశయాలు, దేశ సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, అడిషనల్ డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, ఏసీపీలు మధుసూదన్, జానీ నరసింహులు, ఏఆర్ అదనపు డీసీపీలు సురేష్, శ్రీనివాస్‌తో పాటు ఏఆర్ విభాగానికి చెందిన ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీ జూడో జట్టు ఎంపికలు పూర్తి

హన్మకొండ, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్) :

కాకతీయ విశ్వవిద్యాలయం పురుషులు, మహిళల జూడో జట్ల ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. వివిధ బరువు విభాగాల్లో జరిగిన ఈ ఎంపిక పోటీల్లో పలు జిల్లాలకు చెందిన సుమారు 50 మంది జూడో క్రీడాకారులు పాల్గొన్నారు. 50 కేజీల నుంచి 100 కేజీల వరకు వివిధ బరువు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీమ్ ఆసిఫాబాద్, వరంగల్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. ఈ ఎంపికల్లో మహిళల విభాగం నుంచి ఏడుగురు, పురుషుల విభాగం నుంచి ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్‌లో తమిళనాడులోని వెల్లూరులో ఉన్న వీఐటీ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ జూడో పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ విషయాన్ని కాకతీయ విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ టి. శాస్త్రి తెలిపారు. అంతర్ కళాశాలల టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎస్. కుమార్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు రాబోయే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఎంపిక పోటీలకు సెలెక్టర్లుగా పీడీలు కిషన్, శశికాంత్ (వాగ్దేవి కళాశాల), కేజీసీ డిగ్రీ కళాశాల పీడీ, యాసిన్ (వీసీపీఏ, బొల్లికుంట), బీఈడీ కళాశాల పీడీ ఎన్. రమేష్ వ్యవహరించారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి రిఫరీలు సంతోష్ తదితరులు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు.

విదేశీ విద్యార్థుల దాడి ఘటనపై కేసు నమోదు

హసన్‌పర్తి, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

సిద్ధాపురం గ్రామంలో జరిగిన దాడి ఘటనపై హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు ఫిర్యాదు అందినట్లు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున 1 నుంచి 2 గంటల మధ్య ఎస్ఆర్ యూనివర్సిటీకి చెందిన ఆరుగురు విదేశీ విద్యార్థులు సిద్ధాపురం గ్రామంలోని దొమ్మరి వీధికి వచ్చారు. అక్కడ మేకల సుమంత్‌పై వారు దాడి చేస్తుండగా, గ్రామస్థులు ముస్కు ఉదయ్ (మోడెం రాకేష్), కొక్కిస క్రాంతి, వంగ రామకృష్ణలు అక్కడికి చేరుకుని గొడవను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో విద్యార్థులు రాళ్లు, కర్రలతో గ్రామస్థులపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమయంలో విద్యార్థులు విసిరిన రాయి ముస్కు రాజమణి కుమారుడు ముస్కు రాజేష్ తలకు బలంగా తగలడంతో తీవ్ర గాయమై రక్తస్రావం జరిగినట్లు తెలిపారు. గాయపడిన రాజేష్‌ను వెంటనే ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

హనుమకొండ మహిళా పోలీస్ స్టేషన్ భీమారానికి తరలింపు

నవంబర్ 1 నుంచి కొత్త భవనం నుంచే మహిళలకు పోలీస్ సేవలు

హన్మకొండ, అక్టోబర్ 31(జై భీమ్ క్రైమ్ న్యూస్)

హనుమకొండ మహిళా పోలీస్ స్టేషన్‌ను సుబేదారి పోలీస్ స్టేషన్ పై అంతస్తు నుంచి భీమారంలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ భవనానికి తరలించారు. నవంబర్ 1, 2026 నుంచి మహిళా పోలీస్ స్టేషన్ కొత్త ప్రాంగణం నుంచే ప్రజలకు సేవలు అందించనుంది. మహిళలు, ఫిర్యాదుదారులకు పోలీస్ సేవలు మరింత సులభంగా అందుబాటులో ఉండేలా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సుబేదారి పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీస్ స్టేషన్ నిర్వహణకు తగినంత స్థలం లేకపోవడంతో పాటు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేయడానికి కూడా స్థలాభావం ఏర్పడింది. ఈ నేపథ్యంలో భీమారంలోని విశాలమైన పోలీస్ క్వార్టర్స్ భవనంలో మహిళా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా సర్వోదయ ఎన్జీవో ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను కూడా కొత్త ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. కావున మహిళలు, ప్రజలు ఈ మార్పును గమనించి నవంబర్ 1 నుంచి భీమారంలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సమీపంలోని పోలీస్ క్వార్టర్స్ భవనంలో ఉన్న హనుమకొండ మహిళా పోలీస్ స్టేషన్ సేవలను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు.

నేరాల నివారణకు 'కమ్యూనిటీ కనెక్ట్'

ప్రజల వద్దకే వెళ్లి అవగాహన కల్పిస్తాం: వరంగల్ సీపీ ఎన్. శ్వేత

వరంగల్, అక్టోబర్ 31(జై భీమ్ క్రైమ్ న్యూస్)

నేరాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడంతో పాటు, నేరాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ సిబ్బంది నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివిధ రకాల నేరాలు, మోసాల నివారణపై అవగాహన కల్పించనున్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, మహిళలు, చిన్నారులపై నేరాలు, ఆస్తి నేరాలు, దృష్టి మరల్చి చేసే దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులను ప్రజలకు వివరించి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయడం 'కమ్యూనిటీ కనెక్ట్' ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. సైబర్ నేరాల విషయంలో గుర్తుతెలియని ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. సోషల్ మీడియా వినియోగంలో నకిలీ ఖాతాలు, ఆన్‌లైన్ వేధింపులు, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పిస్తారు. మహిళలు, చిన్నారుల భద్రత, ప్రమాదకర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైనప్పుడు పోలీసుల సహాయం పొందే విధానాలను వివరిస్తారు. ఇళ్లలో దొంగతనాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించనున్నారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థలు, కాలనీలు, ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రతను పెంచుకోవచ్చని పోలీసులు ప్రజలకు వివరించనున్నారు. అదేవిధంగా ప్రజల దృష్టిని మరల్చి నగదు, నగలు, విలువైన వస్తువులను అపహరించే నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, అక్రమ రవాణా, నిల్వ, విక్రయాల వల్ల కలిగే నష్టాలపై ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించనున్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సీపీ కోరారు. తొలుత వరంగల్ నగర పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు కార్యక్రమాన్ని విస్తరిస్తామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బంది ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు నేరాల నివారణకు అవసరమైన సూచనలు అందించనున్నారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం, పోలీసులపై నమ్మకాన్ని బలోపేతం చేయడం, నేరాల నివారణలో ప్రజలను భాగస్వాములను చేయడం కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని సీపీ ఎన్. శ్వేత తెలిపారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని ప్రజలకు సూచించారు. ప్రజల భాగస్వామ్యం, అప్రమత్తతతోనే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రజల భద్రత, నేరాల నివారణ, యువత ఉజ్వల భవిష్యత్తు కోసం వరంగల్ పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని సీపీ ఎన్. శ్వేత పేర్కొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

కేయూలో కే-హబ్ నిర్మాణ పనుల పరిశీలన

పనులను వేగవంతం చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

హన్మకొండ, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కే-హబ్ భవనాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ శుక్రవారం పరిశీలించారు. మూడు అంతస్తుల్లో కొనసాగుతున్న భవన నిర్మాణ పనుల పురోగతిని ఆమె క్షేత్రస్థాయిలో సమీక్షించారు. నిర్మాణ పనుల పురోగతి, ప్రస్తుత పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కే-హబ్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేలా నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యా మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) డివిజినల్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. కే-హబ్ భవన నిర్మాణానికి కాకతీయ విశ్వవిద్యాలయ రూసా నిధులను వినియోగిస్తున్నట్లు కే-హబ్ నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ

ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పోటీలకు కేయూ జట్టు ఎంపిక

హన్మకొండ, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్)

సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పురుషుల పోటీలకు కాకతీయ విశ్వవిద్యాలయం జట్టు ఎంపికైంది. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి విశాఖపట్నంలోని గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (గీతం) ఆధ్వర్యంలో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయం తరఫున మొత్తం కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, వరంగల్‌కు చెందిన కొండోజు దీపక్ బాబు, చిర్రా దినేష్, ధరావత్ రాజేశ్వర్, శ్రీ సాయి స్వరూప్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, కేయూకు చెందిన బండా రాము ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కాకతీయ విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ టి. శాస్త్రి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సౌత్ జోన్ పోటీల్లో కేయూ తరఫున ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. జట్టుకు బొల్లికుంట వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫిజికల్ డైరెక్టర్ యు. రవీందర్ కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తూ క్రీడాకారులతో కలిసి పోటీలకు వెళ్లనున్నారు.

డాక్టర్ రాజమౌళి వైద్య ఆరోగ్యశాఖ సేవలు అభినందనీయం

వరంగల్, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాగుల రాజమౌళి వైద్య ఆరోగ్యశాఖకు అందించిన సేవలు అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి అన్నారు. డాక్టర్ రాజమౌళి ఉద్యోగ విరమణ సందర్భంగా వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి, డాక్టర్ రాజమౌళిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. డాక్టర్ రాజమౌళి ఎన్నో సంవత్సరాల పాటు గిరిజన ప్రాంతాల్లో వైద్య అధికారిగా విశిష్ట సేవలందించారని తెలిపారు. అనంతరం ప్రోగ్రాం అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పనిచేసిన ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ఉద్యోగ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించిన వారికి సమాజంలో మంచి పేరు, గౌరవం లభిస్తాయని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం డాక్టర్ రాజమౌళి ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది డాక్టర్ రాజమౌళితో తమకున్న అనుబంధాన్ని, ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సాజిదా, డాక్టర్ ఇక్తిదార్ అహ్మద్, డాక్టర్ రవీందర్, డాక్టర్ మానస, సదానందం, సుదర్శన్ గౌడ్, దేవిసింగ్, ఎస్‌ఓ ప్రసన్న కుమార్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్ష

హన్మకొండ, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

హన్మకొండ జిల్లాలో జాతీయ ప్రతిభా ఆధారిత ఉపకార వేతన పథకం (ఎన్ఎంఎంఎస్)--2026 స్కాలర్‌షిప్ పరీక్షను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ తెలిపారు. జిల్లాలో మొత్తం 780 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష నిర్వహణ కోసం పరకాలలోని ఎస్ఆర్ ఉన్నత పాఠశాల, లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, హన్మకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మార్కాజీని పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల హాల్‌టికెట్లను ముందుగానే డౌన్‌లోడ్ చేసి, విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందుగానే కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దని, నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకుని పరీక్షా నిబంధనలు పాటించాలని ఆయన తెలిపారు.

ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన సీకేఎం కళాశాల అభివృద్ధిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి!

ఐదు గంటల పాటు కళాశాలలోనే ఉండి ప్రతి అంశంపై సమగ్ర పరిశీలన

ఆడిట్, పరిపాలన, అభివృద్ధి పనులపై ఆరా

అవకతవకల ఆరోపణలకు పారదర్శక విచారణే పరిష్కారమని సూచన

కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలి.. యాజమాన్యానికి కలెక్టర్ డాక్టర్ సత్య శారద దిశానిర్దేశం

వరంగల్, 31 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

దాదాపు ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన వరంగల్‌లోని సీకేఎం ప్రభుత్వ కళాశాల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రత్యేక దృష్టి సారించారు. కేవలం కార్యక్రమానికి హాజరై వెళ్లిపోకుండా, సుమారు ఐదు గంటల పాటు కళాశాలలోనే గడుపుతూ పరిపాలన, ఆడిట్, అభివృద్ధి పనులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హాస్టల్ నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. కళాశాల ప్రస్తుత పరిస్థితులు, ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధ్యాపకులు, సిబ్బంది, యాజమాన్యంతో విడివిడిగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. శనివారం సీకేఎం కళాశాలలో నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పుష్పలతతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆమె క్రమశిక్షణ, సమయపాలనను జీవితంలో భాగంగా చేసుకొని చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు.

ఆడిట్ నుంచి అడ్మినిస్ట్రేషన్ వరకు.. ప్రతి అంశంపై ఆరా!

కళాశాల అభివృద్ధికి ఆటంకంగా మారుతున్న సమస్యలను గుర్తించేందుకు కలెక్టర్ ప్రత్యేకంగా సమయం కేటాయించారు. ఆర్థిక వ్యవహారాలు, ఆడిట్ నివేదికలు, పరిపాలనా నిర్వహణ, కళాశాల అభివృద్ధి కోసం గతంలో చేపట్టిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చుకునే అవకాశాలు, వాటిని ఏయే పనులకు వినియోగించాలనే అంశాలపై కూడా చర్చించారు. కళాశాలలో రహదారుల నిర్మాణం, భవనాల మరమ్మతులు, వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో ప్రతి రూపాయి ఖర్చుకు పారదర్శకత ఉండాలని, పనుల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు.

ఆరోపణలకు తావులేకుండా పారదర్శక విచారణ!

గతంలో కళాశాల ఆర్థిక వ్యవహారాలు, ఆడిట్ నిర్వహణ, పరిపాలనా అంశాలకు సంబంధించి కొన్ని ఆరోపణలు, అభ్యంతరాలు తెరపైకి వచ్చిన నేపథ్యంలో వాటిని భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరాన్ని కలెక్టర్ ప్రస్తావించినట్లు తెలిసింది. ప్రతి అంశాన్ని పరిశీలించి అవసరమైన చోట కమిటీలు ఏర్పాటు చేసి పారదర్శకంగా విచారణ జరిపే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సమాచారం. కళాశాల అభివృద్ధి పేరుతో చేపట్టే ప్రతి పనిలో నాణ్యత, జవాబుదారీతనం ఉండాలని, నిధుల వినియోగం పారదర్శకంగా జరగాలని యాజమాన్యానికి సూచించారు. వ్యక్తిగత అభిప్రాయాలకు కాకుండా కళాశాల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ అందరూ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

కళాశాలకు మంచి పేరు రావాలి!

ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన విద్యాసంస్థగా సీకేఎం కళాశాలకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉందని, దాని ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత అధ్యాపకులు, సిబ్బంది, యాజమాన్యంపై ఉందని కలెక్టర్ సూచించారు. కళాశాల అభివృద్ధి కోసం అందరూ ఓపికతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని, విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. హాస్టల్‌లో విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని సూచించారు. హాస్టల్ నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు, బీసీ విద్యార్థినుల సంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో హాస్టల్‌ను బీసీ సంక్షేమ శాఖ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు.

కలెక్టర్ పర్యటనతోనైనా మార్పు వస్తుందా?

గత వైభవాన్ని తిరిగి సాధించాల్సిన అవసరం ఉన్న సీకేఎం కళాశాలలో కలెక్టర్ స్వయంగా ఐదు గంటల పాటు సమయం కేటాయించి ప్రతి అంశాన్ని పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ పర్యటనలో ఇచ్చిన సూచనలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా ఆచరణలోకి రావాల్సిన అవసరం ఉంది. ఆడిట్, పరిపాలన, అభివృద్ధి పనులపై చేపట్టే తదుపరి చర్యలు ఎంత పారదర్శకంగా ఉంటాయి? గతంలో వచ్చిన ఆరోపణలపై సమగ్ర పరిశీలన జరుగుతుందా? కళాశాలకు అవసరమైన నిధులు సమకూరి మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్ చూపిన చొరవకు అనుగుణంగా సంబంధిత అధికారులు, కళాశాల యాజమాన్యం బాధ్యతగా వ్యవహరిస్తే సీకేఎం కళాశాల అభివృద్ధికి కొత్త దిశ లభించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో వరంగల్ డిఎం అండ్ హెచ్ ఓ బి.రాజారెడ్డి , అధికారులు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోచయ్య, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నియంత్రణ కంటే నమ్మకమే బంధాలను నిలబెడుతుంది

'కార్మోరెంట్ డైలమా' ద్వారా సామాజిక శాస్త్రవేత్త డా. మేడపాటి ఇమ్మానుయేల్ వివరణ

అమరావతి, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్)



సామాజిక శాస్త్రవేత్త,కవి, రచయిత, డా. మేడపాటి ఇమ్మానుయేల్.

నాయకత్వం, మానవ సంబంధాలు, పనితీరులో విశ్వాసానికి, నియంత్రణకు మధ్య సమతుల్యత ఎంతో ముఖ్యమని సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్ అన్నారు. ఈ అంశాన్ని వివరించేందుకు 'కార్మోరెంట్ డైలమా' ఒక చక్కని రూపకమని ఆయన పేర్కొన్నారు. చైనా, జపాన్ దేశాల్లో పురాతన కాలం నుంచి శిక్షణ పొందిన కార్మోరెంట్ (నీటికాకి) పక్షుల సహాయంతో జాలర్లు చేపలు పట్టేవారని ఆయన తెలిపారు. చేపను పట్టుకున్న తర్వాత పక్షి దానిని మింగకుండా ఉండేందుకు దాని గొంతు వద్ద ఒక చిన్న ఉంగరం లేదా వదులైన దారాన్ని కట్టేవారని వివరించారు. పక్షి పెద్ద చేపను పట్టుకుని వచ్చినప్పుడు జాలరి దానిని తీసుకుని, ప్రతిఫలంగా చిన్న చేప ముక్కను ఆహారంగా ఇచ్చేవారని తెలిపారు. అయితే, జాలరి అత్యాశతో పక్షి పట్టుకొచ్చిన చేపలను పూర్తిగా తీసుకుని, దానికి తగిన ప్రతిఫలం ఇవ్వకుండా ఉంటే పక్షిలో చేపలు పట్టాలనే ఆసక్తి క్రమంగా తగ్గిపోతుందని డా. ఇమ్మానుయేల్ వివరించారు. దాని నైపుణ్యం అలాగే ఉన్నప్పటికీ, పనిచేయాలనే ప్రేరణ, నమ్మకం మాత్రం దెబ్బతింటాయని తెలిపారు. ఇదే సూత్రం మానవ సంబంధాలు, ఉద్యోగ రంగం, నాయకత్వంలోనూ వర్తిస్తుందని ఆయన అన్నారు. ఒకరి కష్టాన్ని, అంకితభావాన్ని నిరంతరం గుర్తించకుండా కేవలం ఉపయోగించుకుంటూ సరైన గుర్తింపు, ప్రతిఫలం ఇవ్వకపోతే సంబంధాల్లో విశ్వాసం దెబ్బతింటుందని పేర్కొన్నారు. కఠినమైన నిబంధనలు, భయపెట్టే నియంత్రణ ద్వారా కొంతకాలం పనులు చేయించవచ్చని, అయితే పరస్పర గౌరవం, నమ్మకం లేకపోతే అసంతృప్తి, నిరాశ పెరిగి చివరకు పనితీరు కూడా తగ్గిపోతుందని అన్నారు. శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభించినప్పుడే వ్యక్తుల్లో బాధ్యత, అంకితభావం, ప్రేరణ కొనసాగుతాయని తెలిపారు. కేవలం నియంత్రణ, బలవంతంపై ఆధారపడి మానవ విలువలు, న్యాయాన్ని విస్మరించే ఏ వ్యవస్థ లేదా బంధమైనా దీర్ఘకాలం కొనసాగదని 'కార్మోరెంట్ డైలమా' స్పష్టమైన సందేశాన్ని ఇస్తుందని డా. మేడపాటి ఇమ్మానుయేల్ పేర్కొన్నారు.

కిట్స్ వరంగల్‌లో ఘనంగా ముగిసిన 'సమశోధిని'26

వరంగల్, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

కిట్స్ వరంగల్ క్యాంపస్‌లో రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం 'సమశోధిని'26 శుక్రవారం ఘనంగా ముగిసింది. సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్‌లో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు సమశోధిని'26 నిర్వహించినట్లు తెలిపారు. వివిధ ఇంజినీరింగ్, ఎంబీఏ విభాగాల ఆధ్వర్యంలో 50కి పైగా సాంకేతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఇన్నోవిజన్, ట్రెజర్ హంట్ తదితర కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సింపోజియంలో 4,500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఫెస్ట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించేందుకు సమశోధిని మంచి వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధ్యాపకులు, విద్యార్థులను కిట్స్ యాజమాన్యం అభినందించింది.

తిప్పరోని కుంట బండ్ అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించాలి

హన్మకొండ, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

తిమ్మాపూర్‌లోని తిప్పరోని కుంట బండ్ అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి, నాణ్యతతో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్, సాగునీటిపారుదల, సర్వే అధికారులతో కలిసి తిప్పరోని కుంటను కలెక్టర్ పరిశీలించారు. కుంట కట్ట ప్రారంభం నుంచి చివరి వరకు విస్తీర్ణాన్ని పరిశీలించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కుంట బండ్‌పై ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వివిధ రకాల మొక్కలతో ప్లాంటేషన్ చేపట్టాలని, ఇందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. అలాగే బండ్‌పై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, కట్ట సుందరీకరణ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు వాకింగ్‌కు అనుకూలంగా ఉండేలా తిప్పరోని కుంట బండ్‌ను అభివృద్ధి చేయాలని, పనులను త్వరగా ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజయ్, సాగునీటిపారుదల శాఖ ఈఈ కిరణ్ కుమార్, డీఈ మధుసూదన్ రెడ్డి, సర్వేయర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా జడ్జి సునిత

హన్మకొండ, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

పిల్లల భద్రత, హక్కులు, రక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ జిల్లా జడ్జి సునిత సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో "సురక్షిత్ బచ్‌పన్ అభియాన్"లో భాగంగా విద్యార్థులకు లీగల్ లిటరసీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను గుర్తించడం, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడం వంటి అంశాలను వివరించారు. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం--2012 గురించి, ఫిర్యాదు చేసే విధానం, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని విద్యార్థులకు సూచించారు. అలాగే బాలల అక్రమ రవాణా ప్రమాదాలను వివరిస్తూ, అపరిచితులు ఇచ్చే ప్రలోభాలకు గురికాకుండా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పెద్దలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఆపదలో ఉన్న పిల్లల కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైనప్పుడు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. పిల్లలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ హైమ పూజిత, ట్రిబ్యునల్ కోర్టు మెంబర్, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, డీడబ్ల్యూఓ విశ్వజ, జీసీడీవో సునిత, రవి, కవిత, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ తూకంతో విక్రయిస్తే కఠిన చర్యలు

బియ్యం, కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు.. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 10 కేసులు

వరంగల్, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

వినియోగదారులకు నిర్ణీత తూకం కంటే తక్కువగా సరుకులు విక్రయిస్తూ మోసాలకు పాల్పడే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కూచన మనోహర్ హెచ్చరించారు.

వరంగల్ పట్టణంలోని పలు బియ్యం దుకాణాలు, కిరాణా, జనరల్ స్టోర్లలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 26 కిలోలుగా పేర్కొన్న కొన్ని బియ్యం బస్తాల్లో కేవలం 25 కిలోల బియ్యం మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై మొత్తం 10 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కూచన మనోహర్ మాట్లాడుతూ.. ప్యాక్ చేసిన సరుకులపై నికర బరువును స్పష్టంగా ముద్రించాలని, బస్తాలపై పేర్కొన్న బరువుకు అనుగుణంగానే వినియోగదారులకు సరుకులు విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. నిర్ణీత బరువు కంటే తక్కువగా సరుకులు విక్రయిస్తే తూనికలు, కొలతల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినియోగదారులు కూడా సరుకులు కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్లపై ముద్రించిన నికర బరువును పరిశీలించాలని సూచించారు. వినియోగదారుల హక్కులను కాపాడేందుకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వ్యాపారులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన తెలిపారు.

మిషన్ వాత్సల్య పథకానికి 216 మంది అర్హుల ఎంపిక

హన్మకొండ, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన 216 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మిషన్ వాత్సల్య పథకం అర్హుల ఎంపికపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిషన్ వాత్సల్య పథకం కింద వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను గుర్తించినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ప్రాజెక్టు స్థాయిలో సీడీపీఓలు నిర్వహించిన పరిశీలన, సామాజిక దర్యాప్తు నివేదికల ఆధారంగా అర్హులను గుర్తించినట్లు పేర్కొన్నారు. అనంతరం అర్హుల జాబితాను బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశపెట్టి, జిల్లా స్థాయి స్పాన్సర్‌షిప్ కమిటీ ఆమోదంతో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు లేని బాలబాలికలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు, తల్లి లేదా తండ్రి విడిచిపెట్టడంతో సంరక్షకుల వద్ద ఆశ్రయం పొందుతున్న పిల్లలు, వితంతు మహిళల కుటుంబాలకు చెందిన పిల్లలు తదితర అర్హులకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. 2026--27 సంవత్సరానికి రక్షణ, సంరక్షణ, విద్య, వైద్యం, పోషకాహారం వంటి అవసరాలు ఉన్న 28 మంది బాలబాలికలను ప్రత్యేకంగా గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం ఏడు కేటగిరీల్లో అర్హులను ఎంపిక చేయగా, మొత్తం 216 మంది లబ్ధిదారులకు మిషన్ వాత్సల్య పథకం వర్తించనుందని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ, బాలల సంక్షేమ సమితి సభ్యుడు డాక్టర్ పరికి సుధాకర్, సీడీపీఓలు, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ సీహెచ్. అవంతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జి అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, సంబంధిత అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సోషల్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 5 నుంచి 11 వరకు విద్యార్థి అమరవీరుల వర్ధంతి సభలు

కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం

హన్మకొండ, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

విద్యార్థుల హక్కుల కోసం, సమాజంలో మార్పు కోసం ఉద్యమిస్తూ అమరులైన విద్యార్థి నాయకుల వర్ధంతి సభలను నవంబర్ 5 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ కాకతీయ యూనివర్సిటీ కార్యవర్గం తెలిపింది. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట వర్ధంతి సభలకు సంబంధించిన పోస్టర్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన విద్యార్థి అమరవీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. నవంబర్ 5 నుంచి 11 వరకు నిర్వహించే వర్ధంతి సభలను విద్యార్థులు, ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయడంతో పాటు విద్యారంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలని అన్నారు. పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర నాయకులు సూత్రపు అనిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని, విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని నియమించి విద్యారంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వంశీకృష్ణ, బీక్షిత్‌రెడ్డి, అలీ, స్నేహ, అంజలి, గణేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత యువతే లక్ష్యం

విద్యార్థులకు అవగాహన కల్పించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

హన్మకొండ, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

జాతీయ పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమం--4.0లో భాగంగా నడికూడ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పొగాకు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మురళి పాల్గొని పొగాకు వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ పొగాకు వినియోగంతో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో పాటు గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. యువత గుట్కా, ఖైనీ, సిగరెట్లు, బీడీలకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, పొగాకు రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని కోరారు. పాఠశాలలు, విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగం, విక్రయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య, ఎంపీహెచ్‌ఈఓ రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లోకాయుక్త జస్టిస్ ఎ. రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

హన్మకొండ, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ ఎ. రాజశేఖర్ రెడ్డి శనివారం హనుమకొండ జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి లోకాయుక్త జస్టిస్ ఎ. రాజశేఖర్ రెడ్డికి పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ మర్యాదపూర్వక భేటీలో పలు అంశాలపై సౌహార్దపూర్వకంగా చర్చించారు.

ఏక్తా దివస్ సందర్భంగా ఘనంగా 'రన్ ఫర్ యూనిటీ'

జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్

కాకినాడ, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్)

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఏక్తా దివస్ సందర్భంగా కాకినాడ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది సర్పవరం పోలీస్ స్టేషన్ నుంచి రిజర్వ్ పోలీస్ లైన్స్ మీదుగా జిల్లా పోలీసు కార్యాలయం వరకు ఐక్యతా పరుగులో పాల్గొన్నారు. స్థానికులు, మీడియా ప్రతినిధులు కూడా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను ఏకతాటిపైకి తీసుకురావడంలో పటేల్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. ఏక్తా దివస్ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, ఎస్. శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.జి. శ్రీహరి రావు, ఆర్‌ఐలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపూర్‌లో ప్రసూతి సేవలు పునఃప్రారంభం

తొలి సిజేరియన్ శస్త్రచికిత్స విజయవంతం

కమలాపూర్, అక్టోబర్ 31(జై భీమ్ న్యూస్)

కమలాపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి వైద్య సేవలను తిరిగి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలో తొలి లోయర్ సెగ్మెంట్ సిజేరియన్ శస్త్రచికిత్స ద్వారా ప్రసవాన్ని వైద్య బృందం విజయవంతంగా నిర్వహించింది. గూడూరు గ్రామానికి చెందిన తాళ్లపల్లి మానస (28)కు శనివారం ఉదయం 10.55 గంటలకు సిజేరియన్ శస్త్రచికిత్స నిర్వహించగా, ఆమె 3.25 కిలోల బరువున్న ఆరోగ్యవంతమైన మగ శిశువుకు జన్మనిచ్చారు. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. వారికి అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వంశీకృష్ణ పర్యవేక్షణలో, స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రణీత, మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ కిషన్ సహకారంతో శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. శిశువుకు అవసరమైన వైద్య పర్యవేక్షణను శిశు వైద్య నిపుణుడు డాక్టర్ వంశీకృష్ణ అందించారు. ప్రసూతి సేవల పునఃప్రారంభ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, పరకాల సీ.ఎస్.ఆర్.ఎం.ఓ. డాక్టర్ నారాయణరెడ్డి, హుజూరాబాద్ ఉప సీ.ఎస్.ఆర్.ఎం.ఓ. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ చందు నాయక్, ఆర్.ఎం.ఓ. డాక్టర్ రవి, డాక్టర్లు వి. రవి ప్రవీణ్‌రెడ్డి, అపర్ణ, స్వప్న, వరుణ్, ప్రవణ్య, స్నేహతో పాటు నర్సింగ్ అధికారులు, శస్త్రచికిత్స విభాగ సాంకేతిక సిబ్బంది, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. కమలాపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి సేవలు పునఃప్రారంభమై తొలి సిజేరియన్ శస్త్రచికిత్స విజయవంతం కావడం ఆరోగ్య సేవల అభివృద్ధిలో కీలక ముందడుగుగా అధికారులు పేర్కొన్నారు. ఈ సేవలతో కమలాపూర్ మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన ప్రసూతి, అత్యవసర వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రానున్నాయి.

గ్రామాల విలీనంపై స్పష్టత ఇవ్వాలి

కార్పొరేషన్ లేదా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి
42, 48 డివిజన్ల పౌరుల ధర్నా

కాకినాడ, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్)

కాకినాడ నగర పాలక సంస్థలో విలీనం చేసిన 42, 48 డివిజన్ల పరిధిలోని గ్రామాలను అనిశ్చితిలో ఉంచకుండా వెంటనే ఎన్నికలు నిర్వహించాలని పౌర కమిటీలు డిమాండ్ చేశాయి. శనివారం సినిమా రోడ్డులోని కాకినాడ కార్పొరేషన్ కార్యాలయం వద్ద 42, 48 డివిజన్ల పౌర కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే స్వామికి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి, గవర్నర్, రాష్ట్ర ఎన్నికల సంఘం, హైకోర్టుకు కూడా తమ సమస్యను తెలియజేస్తూ ప్రతులను పంపించారు. పదేళ్లుగా ఈ ప్రాంతాల్లో జనన, మరణ ధ్రువపత్రాలు, ఆధార్, భూముల రిజిస్ట్రేషన్లు, ఆస్తి పన్నులు, నీటి పన్నులు తదితర ప్రభుత్వ సేవలు నగర పాలక సంస్థ పరిధిలోనే కొనసాగుతున్నాయని పౌర కమిటీ నాయకులు తెలిపారు. పన్నులు వసూలు చేస్తున్న కార్పొరేషన్ ఎన్నికల విషయంలో మాత్రం ఈ ప్రాంతాలను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్పొరేషన్ పరిధిలో కొనసాగించాలంటే కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే గ్రామాలను పంచాయతీలకు అప్పగించి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణ రాజు మద్దతు తెలిపారు. విలీన గ్రామాల సమస్యను ప్రభుత్వం పూర్తిగా పరిష్కరించిన తర్వాతే ఎన్నికల ప్రక్రియను చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పెదపాటి సుబ్రహ్మణ్యం, జయకుమార్, దుర్గా రమణ, తోకల చిన్న రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు,త్యాగాలు చిరస్మరణీయం:మోహన్ గౌడ్

ఐనవోలు : (జై భీమ్ న్యూస్)

భారత మాజీ ప్రధానమంత్రి,దివంగత ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఐనవోలు మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు ఐనవోలు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మోహన్ గౌడ్ గారు మాట్లాడుతూ...దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ఇందిరా గాంధీ చేసిన కృషి, దేశ అభివృద్ధికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశం కోసం ఆమె చేసిన త్యాగాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల సర్పంచ్ ల పోరం అధ్యక్షులు పోలపల్లి శివశంకర్ రెడ్డి,నందనం సర్పంచ్ జట్టబోయిన రాజు,లింగమోరిగూడెం సర్పంచ్ దామెర యాకయ్య, ఉడుత గూడెం గ్రామం సర్పంచ్ జన్నపురెడ్డి దేవికా రెడ్డి,వనమాల కనపర్తి సర్పంచ్ రిపిక ఎల్లస్వామి,పెరుమాండ్లగూడెం సర్పంచ్ దూపల్లి రాకేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఉప సర్పంచ్లు, గ్రామ శాఖ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వార్డు మెంబర్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు,అనుబంధ సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కాపర్ల సమస్యలు పరిష్కరించాలి

ఐనవోలు : (జై భీమ్ న్యూస్)

గొర్రెల మేకల పెంపకందారుల సంఘం హనుమకొండ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో గొర్రెల, మేకల పెంపకందారుల స్థితిగతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర సర్వే గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రారంభించారు. లింగయ్య మాట్లాడుతూ....గొర్రెలు మేకల మేత కోసం ప్రైవేటు భూములను మేపు కోవడానికి వేలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేస్తున్న మనీ పెంప పందాలు వివరించారని పశువైద్యాధికారులు కూడా అందుబాటులో ఉండడం లేదని. మురళి మేకలకు వస్తున్న వివిధ రోగాలకు ప్రభుత్వం నుండి ఎలాంటి మందులు పంపిణీ చేయడం లేదని చేయడం లేదని ప్రవేటు మందుల షాపులలో సంవత్సరానికి 20 నుండి 30 వేల రూపాయల దాకా ఖర్చు పెట్టి ఆర్థికంగా నష్టపోతున్నామని వారు వివరించారు. గొర్లపై కుక్కల దాడి పెరిగిందని వారు వివరించారరూ ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందలేని. దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు లింగయ్య అన్నారు గొర్రెల, మేకల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్న కాపరుల ఆర్థిక, సామాజిక స్థితిగతులను తెలుసుకోవడానికి, ప్రభుత్వం నుంచి వారికి అందాల్సిన సంక్షేమ పథకాలు, సబ్సిడీలు. ప్రభుత్వం అందించడం లేదు. గొర్రెల పెంపకందారులు ఎదుర్కొంటున్న. 50 సంవత్సరాలు దాటిన గొర్రెల కాపరులకు నెలకు 5000 పెన్షన్. మేత సమస్యలు, వైద్య సదుపాయాలు, భీమా పథకం అమలు వంటి అంశాలను సర్వే ద్వారా సేకరించి, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి . తీసుకెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. సంఘం పోరాట ఫలితంగా గొర్ల మేకలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం కరీంనగర్లో లాంచనంగా ప్రకటించింది 70 వేల గొర్రెలు కు ఇన్సూరెన్స్ చేస్తామని అనడం చాలా విడ్డూరంగా ఉందని ఆయన మనిపడ్డారు వెంటనే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గొర్లు మేకలు అన్నిటికీ ఒకే దఫాలో ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం మండల కార్యదర్శి నల్ల బెట్ట చిన్నరాజు మాట్లాడుతూలి మండల కేంద్రంలో పశు వైద్యశాల ఉన్నప్పటికీ డాక్టర్లు మాత్రం సమయానికి రాకపోవడం కాపర్లు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని. సంవత్సరానికి నాలుగుసార్లు గొర్లు మేకలకు నట్టలమందుల తో పాటు వివిధ రోగాలకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపించాలని ఆయన కోరారు. ఈసమావేశంలో రాజారపు ఎల్లయ్య. ఈరబోయిన కట్టయ్య. వేల్పుల మల్లయ్య. బండి కుమారస్వామి. ఉడుత కొమురయ్య. మల్లయ్య.రాదాలపు రవి. రాజేశ్వర్. బండమీది సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌లకు కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి

కొండా దంపతుల ఆదేశాల మేరకు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పణ

వరంగల్, 31 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)

మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కొండా దంపతుల ఆదేశాల మేరకు వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ, గిర్మాజీపేట ప్రాంతాల్లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహాలకు, వెంకట్రామ జంక్షన్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా విశ్వశ్రీ రెసిడెన్సీ నూతన కమిటీ

హన్మకొండ, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్)

విశ్వశ్రీ రెసిడెన్సీ ఓనర్స్ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మావురపు విజయభాస్కరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రుద్రోజు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా రాచర్ల కుమారస్వామి, జాయింట్ సెక్రటరీగా సయ్యద్ అహ్మద్, కోశాధికారిగా శ్రీరామోజు విద్యాసాగర్ ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా బి. లక్ష్మణ్, ఇంజనీర్ కంకల సదానందం, ఎం. నారాయణ, ఆడెపు నాగరాజు, ఎన్. దేవేందర్, కె. శ్రీనివాస్, కె. సత్యనారాయణ, వి. సాయికుమార్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో నవంబర్‌లో అపార్ట్‌మెంట్‌లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రతి నెల 10వ తేదీలోపు మెంటెనెన్స్ చెల్లించాలని ఓనర్లను కోరారు. భగీరథ నీటి సరఫరా తక్కువగా వస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అపార్ట్‌మెంట్ అభివృద్ధికి ఓనర్లు తమ సలహాలు, సూచనలు అందించాలని నూతన కమిటీ కోరింది. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఓనర్లకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన

హన్మకొండ, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్)

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కాకతీయ యూనివర్సిటీ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా గ్రావిటీ జూనియర్ కాలేజ్, రాప్టర్ అకాడమీ, గీతాంజలి డిగ్రీ కాలేజ్, రామప్ప కోచింగ్ అకాడమీలను సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, ప్రొఫెసర్ దినేష్ కుమార్ పాల్గొని విద్యార్థులు, అధ్యాపకులు, గ్రాడ్యుయేట్లకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యావంతులైన యువత రాజకీయ, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ద్వారా విద్యావంతులు తమ సమస్యలు, ఆకాంక్షలను శాసనమండలిలో వినిపించే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత గడువులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. వివిధ విద్యాసంస్థల్లో విద్యార్థులు, అధ్యాపకులు, పట్టభద్రులకు ఓటరు నమోదు ఆవశ్యకతను వివరించడంతో పాటు నమోదు ప్రక్రియపై ఉన్న సందేహాలను నిర్వాహకులు నివృత్తి చేశారు. అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయించడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి నాయకులు, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించాలి

సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎం. గౌతమి

రాజమహేంద్రవరం, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్)

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా మైక్రో అబ్జర్వర్లు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎం. గౌతమి సూచించారు. శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నియమితులైన మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ఎవరి ప్రభావానికీ లోనుకాకుండా ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తున్నారా లేదా గమనించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా, ఓటర్లు స్వేచ్ఛగా, గోప్యతతో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎం. గౌతమి తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు ప్రత్యక్షంగా గమనించిన వాస్తవాలను మాత్రమే నివేదికల్లో నమోదు చేయాలని, వినికిడి మాటలు, అపోహల ఆధారంగా నివేదికలు రూపొందించరాదని స్పష్టం చేశారు. పోలింగ్ పూర్తయిన అనంతరం నిర్దేశిత చెక్‌లిస్ట్‌ను పూర్తి చేసి, తమ పరిశీలనలతో కూడిన నివేదికను రిసెప్షన్ కేంద్రంలోని అబ్జర్వర్ డెస్క్ వద్ద నేరుగా అందజేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని పిలుపునిచ్చారు.

అత్యవసర పరిస్థితులపై పూర్తి అవగాహన అవసరం

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం. రాజు మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా, శాంతిభద్రతలకు విఘాతం కలిగినా అనుసరించాల్సిన విధానాలపై స్పష్టత ఉండాలన్నారు. జనరల్ అబ్జర్వర్‌కు ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించే విధానాన్ని తెలుసుకోవాలని, ఎన్నికల విధులకు సంబంధించి సందేహాలను శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎల్‌డీఎం డి.వి. ప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్లు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. పోలింగ్ రోజు ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ పూర్తయి, బ్యాలెట్ బాక్సులను సీల్ చేసే వరకు పాటించాల్సిన విధివిధానాలను మాస్టర్ ట్రైనర్లు వివరించారని పేర్కొన్నారు. కొవ్వూరు డివిజన్ అభివృద్ధి అధికారి కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమన్నారు. ఎన్నికల విధులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. రాజమహేంద్రవరం డివిజన్ అభివృద్ధి అధికారి పి. వీణాదేవి మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకునేందుకు రవాణా సౌకర్యాలపై ముందుగానే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ రోజున ఉదయం 6 గంటలకే కేటాయించిన కేంద్రాలకు చేరుకునేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. తొలిసారిగా ఎన్నికల విధులకు హాజరవుతున్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం అందిస్తుందని భరోసా ఇచ్చారు. శిక్షణా కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ విధానం, మైక్రో అబ్జర్వర్ల బాధ్యతలు, పోలింగ్ సమయంలో పరిశీలించాల్సిన అంశాలు, సమర్పించాల్సిన నివేదికలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికలకు నియమితులైన మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ కార్పొరేషన్‌లో జమాబందీ నిర్వహిస్తేనే అవినీతి గుట్టు తేలుతుంది

అవినీతి నిరోధక శాఖ తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలి

పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు

కాకినాడ, అక్టోబర్ 31 (జై భీమ్ న్యూస్)

కాకినాడ నగర పాలక సంస్థలో అవినీతిని అరికట్టేందుకు అవినీతి నిరోధక శాఖ తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం కన్వీనర్, ప్రముఖ సామాజికవేత్త దూసర్లపూడి రమణ రాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత 24 ఏళ్లుగా కాకినాడ నగర పాలక సంస్థకు ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలోని ఏపీయూఎస్‌పీ పథకం నుంచి స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల వరకు వేల కోట్ల రూపాయల నిర్మాణ నిధులు వచ్చాయని, వాటిలో సుమారు సగం మేరకు తీవ్రంగా దుర్వినియోగం జరిగినట్లు ఆయన ఆరోపించారు. ఈ పనుల్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది ఆస్తులు భారీగా పెరిగినప్పటికీ సంబంధిత వ్యవహారాలపై సమగ్ర విచారణ జరగడం లేదని విమర్శించారు. కార్పొరేషన్ స్మార్ట్ సిటీ సంస్థగా మారిన తర్వాత విజిలెన్స్ విచారణలు, అవినీతి నిరోధక శాఖ దాడులు పూర్తిగా తగ్గిపోయాయని ఆయన పేర్కొన్నారు. కాకినాడలో పనిచేసిన కొందరు అధికారులు బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్లి, తిరిగి నగరానికి కొత్త నిధులు వచ్చినప్పుడు ఇక్కడికి చేరుకోవడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. ఈ విధమైన వ్యవహారాల కారణంగా కార్పొరేషన్‌కు చెందిన వందల కోట్ల రూపాయల సాధారణ నిధులు కూడా పక్కదారి పట్టే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయాల్లో కూర్చొని అవినీతి రహిత పాలనపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని రమణ రాజు అన్నారు. కాకినాడ నగర పాలక సంస్థలో గతంలో పనిచేసిన అధికారులు, సిబ్బంది ఆస్తులపై సమగ్ర విచారణ నిర్వహించి జమాబందీ లెక్కలు తీస్తేనే అసలు అవినీతి గుట్టు బయటపడుతుందని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు ఇకనైనా కేవలం ప్రచార కార్యక్రమాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని ఆయన సూచించారు. వార్డు సచివాలయాల పరిధిలో ప్రజలకు అవినీతి వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కార్పొరేషన్‌లో నిధుల వినియోగం, నిర్మాణ పనులు, అధికారుల ఆస్తులు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని దూసర్లపూడి రమణ రాజు కోరారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

115 సమ్మర్ హాలిడేస్" సినిమా ప్రతి పాత్రకు కనెక్ట్ అవుతారు

- ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని

కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై "సమ్మర్ హాలిడేస్" అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నవంబర్ 6న "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని ఈ కథ విన్నప్పుడు మనసును హత్తుకుంది. నా రియల్ లైఫ్, నా చైల్డ్ హుడ్ మెమొరీస్ గుర్తుకువచ్చాయి. ఈ సినిమాలో అమ్మమ్మ పాత్రలో జయసుధ చెప్పే డైలాగ్స్ మా అమ్మమ్మ చెప్పినట్లు, వాసుకి గారు చెప్పే మాటలు మా అమ్మ చెప్పినట్లు అనిపించాయి. మా అమ్మ అలాగే నాతో మాట్లాడేది. నాతో పాటు ప్రేక్షకులకు కూడా అదే ఫీల్ కలుగుతుందని నమ్మాను. ఈ కథలో చిన్నపిల్లల పాత్రలను టీనేజ్ లోకి మార్చి ఒక లవ్ స్టోరీ పెట్టి కమర్షియల్ గా మార్చవచ్చు. కానీ బాల్యంలో ఉండే ఆ ఇన్నోసెన్స్ పోతుంది. పాత్రల్లోని ఆ సున్నితత్వమే ఈ కథలో కీలకమైంది. మనకు ట్రెండ్ బ్రేక్ చేసే సినిమాలో ఎన్నో వస్తుంటాయి. పెళ్లిచూపులు వంటి సినిమాల తర్వాత మన దగ్గర రొమాంటిక్ కామెడీ మూవీస్ ట్రెండ్ పోయింది అన్నారు. ఆ తర్వాత ప్రేమలు సినిమా తెలుగులో డబ్ అయి ఆదరణ పొందింది. ఆ తర్వాత లిటిల్ హార్ట్స్ వచ్చింది. "సమ్మర్ హాలిడేస్" కథను చెబితే మళ్లీ పిల్లల సినిమాలు ఇండస్ట్రీలో నిర్మిస్తారని, ఆ చిత్రాలకు మా సినిమా స్ఫూర్తిగా నిలుస్తుందని నమ్మాం. అమ్మమ్మగా నటించిన జయసుధ గారు మొన్న ట్రైలర్ లాంఛ్ కు రావాల్సిఉంది. ఆమె నెక్ట్స్ ఈవెంట్ కు వస్తున్నారు. నేను నమ్మిన కథను బలంగా ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నా. సమ్మర్ సీజన్ లో మా సినిమా రిలీజ్ చేయాలని అనుకున్నా కుదరలేదు. ఇప్పుడు రిలీజ్ కుదిరింది కాబట్టి దీపావళి పండక్కి కరెక్టేమో అనిపించింది. ఈ నెల 30న వచ్చే సినిమాలు నవంబర్ 6కు వాయిదా పడతాయని భయపడ్డాం కానీ అవేమీ రావడం లేదు. లక్కీగా మా సినిమాకు దాదాపు సోలో రిలీజ్ దొరికిందని అనుకోవచ్చు. ఒక స్పెషల్ అటెంప్ట్ చేసే చిత్రాలకు, కొత్త నిర్మాతలు తీసే చిన్న చిత్రాలకు, స్థానికంగా రూపొందించే సినిమాలకు ప్రభుత్వం నుంచి ఏదైనా రాయితీ ఇస్తే బాగుంటుంది. ఎందుకంటే థియేటర్స్ నుంచి రెవెన్యూ తగ్గిపోయింది. ఓటీటీలు పెద్ద సినిమాలే తీసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో చిన్న సినిమాకు ప్రభుత్వం సపోర్ట్ ఇస్తే బాగుంటుంది. మా సినిమాకు నవంబర్ 6న మంచి థియేటర్స్ దొరుకుతున్నాయి. పాజిటివ్ టాక్ మొదలయ్యాక ఇంకా పెరుగుతాయి. మా సినిమాలో మెసేజ్ ఏమీ ఉండదు. మంచి ఎమోషన్స్ ఉంటాయి. పిల్లలు రెండు నెలలు వేసవి సెలవులు గడిపి తిరిగి వెళ్లిపోతుంది అమ్మమ్మ, ఆ ఊరి స్నేహితులు ఎమోషనల్ గా మారడం, అరుణ్, రోహన్ క్యారెక్టర్స్ మధ్య ఉండే బాండింగ్, తండ్రి కొడుకు ఎమోషనల్ సీన్స్ హార్ట్ టచింగ్ గా ఉంటాయి. నేను నిర్మాతగా అవార్డ్స్ ఆశించడం లేదు. థియేటర్స్ కు ప్రేక్షకులు వచ్చి మా సినిమాను సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా. "సమ్మర్ హాలిడేస్" సినిమా వర్కవుట్ అయితే ఇండస్ట్రీలో మరిన్ని ఇలాంటి మంచి చిత్రాలు వస్తాయని నమ్ముతున్నాను. నేను గర్ల్ ఫ్రెండ్ సినిమా నిర్మించినప్పుడు అది అన్ని వర్గాల ప్రేక్షకుల కోసం కాదు, ఒక సెక్షన్ చూస్తారని నమ్మాను. ఈ తరహా చిత్రాలను కూడా చూసే వాళ్లు ఉంటారు. ఎవరో ఒకరు అడుగు వేస్తేనే కదా మరొకరికి స్ఫూర్తిగా నిలుస్తాం. నేను ఫ్యూచర్ లో పెద్ద పెద్ద సినిమాలు చేసినప్పుడు, ఓ పదేళ్ల తర్వాత నా ప్రొడక్షన్ లో "సమ్మర్ హాలిడేస్" సినిమా వచ్చిందని గుర్తుపెట్టుకుంటాను. అలాంటి స్పెషల్ ఫిలిం ఇది. రోహన్, అరుణ్ పాత్రల్లో ఎంత సహజత్వం, సున్నితత్వం ఉందో అలాంటి ఇన్నోసెన్స్ , నిజాయితీ మా డైరెక్టర్ లో చూశాను. ఈ కథలో ఏ అంశం కావాలని తీసుకొచ్చినట్లు ఉండదు. మూవ్ మెంట్స్, విజువల్స్ కూడా అంతే సహజంగా తెరకెక్కించాడు. ఈ ఏడాది సినిమాలు మొదటి ఆరునెలలు రిలీజ్ కు రాలేదు. ఇప్పుడు వరదలా వస్తున్నాయి. టీజర్ ల మీద టీజర్ లు, ట్రైలర్స్ మీద ట్రైలర్స్, పాటల మీద పాటలు రిలీజ్ అవుతున్నాయి. ప్రేక్షకులకు కూడా ఏదీ రిజిస్టర్ అయ్యే స్పేస్ ఇవ్వడం లేదు. మన ప్రొడ్యూసర్స్ ముందే ప్లాన్ చేసుకుని ఉంటే ఈ ఇయర్ సెకండాఫ్ లో ఇంతగా సినిమాల రద్దీ ఉండేది కాదు. ప్రస్తుతం మా సంస్థలో సంగీత్ శోభన్, అనస్వరతో అంతా రాములోరు చూస్కుంటారు సినిమా నిర్మిస్తున్నాం. 80 శాతం చిత్రీకరణ పూర్తయింది. డిసెంబర్ రిలీజ్ అనుకున్నాం కానీ ఇప్పుడున్న పరిస్థితులు చూసి ఫిబ్రవరికి రిలీజ్ మార్చుకున్నాం. ఆ తర్వాత 35 మూవీ డైరెక్టర్ నందకిషోర్ తో ఒక సినిమా, కిష్కిందపురి దర్శకుడు కౌశిక్ తో ఒక సినిమా చేయబోతున్నాను. సంక్రాంతి తర్వాత ఈ సినిమాలు సెట్స్ మీదకు వెళ్తాయి.

'జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రం ట్రైలర్ లాంచ్

నమో జయం ప్రొడక్షన్స్ బ్యానర్ లో దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మాణంలో జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన తెరకెక్కించిన చిత్రం 'జయంత్ అండ్ ది జింగో పెన్'. ఈ సినిమాలో మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. 'జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రం నవంబర్ 12న చిల్డ్రన్స్ డే స్పెషల్గా థియేటర్లలో విడుదల కానుంది. చిన్నారులకు ఆలోచింపజేసే, మంచి సందేశాన్ని అందించేలా రూపొందిన ఈ చిత్రం పిల్లలకు తల్లిదండ్రులకు టీచర్స్కు ఒక మంచి సినీ అనుభూతిని అందించనుంది. చిన్నారులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులందరూ కలిసి ఈ చిత్రాన్ని చూడాలని చిత్ర బృందం కోరుతోంది. ఈ చిల్డ్రన్స్ డే సందర్భంగా పిల్లలతో కలిసి ఆనందించదగిన చిత్రంగా 'జయంత్ అండ్ ది జింగో పెన్' నిలవనుంది. ఈ క్రమంలో ఈ మూవీ ట్రైలర్ను లిటిల్ ఫ్లవర్ స్కూల్లో శుక్రవారం నాడు విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో.. ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ .. "జయంత్ అండ్ ది జింగో పెన్' కథ చాలాబాగుంది. దివ్యప్రవీణ్ గారు నాకు ఈ సినిమా గురించి ముందే చెప్పారు. నేను కూడా ఓ టీచర్గా పని చేశాను. 'జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రం హిందీలో వచ్చిన 'తారే జమీన్ పర్' చిత్రం ఎంతటి ఘనవిజయాన్ని అందుకుందో.. తెలుగులో ఈ చిత్రం అంతటి పెద్ద విజయాన్ని అందుకుంటుంది ఈ సినిమాని పిల్లలు, పేరెంట్స్, టీచర్స్ తప్పకచూడాల్సిన సినిమా' నేను మొదటి రోజే ఒక హాల్ మొత్తం బుక్ చేసుకొని నేను మా టీచర్లు మా స్టూడెంట్స్ అందరం కలిసి మొదటి షో చూస్తాము అని అన్నారు. ప్రవీణ్ బొలిశెట్టి మాట్లాడుతూ .. "నవీన్కి జాతీయ అవార్డులు వచ్చాయి. బయటి భాషల్లో సినిమాలు చేసి అవార్డులు సాధించారు. ఇప్పుడు తెలుగులో చేస్తున్నారు. అమ్మా, నాన్న, గురువు గొప్పదనం చాటి చెప్పేలా ఈ చిత్రం ఉంటుంది. మా అబ్బాయి జయంత్ చక్కగా నటించాడు. ఈ సినిమాకి పాటలు, మాటలు, ట్యూన్స్ అన్నీ నేను ఇచ్చాను. విద్యా వ్యవస్థపై ఎక్కుపెట్టే సినిమా ఇది. పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 12న ఈ మూవీని రిలీజ్ చేస్తున్నాం. ప్రతీ స్టూడెంట్, ప్రతీ పేరెంట్, ప్రతి టీచర్ చూడాల్సిన సినిమా ఇది' అని అన్నారు. దివ్య ప్రవీణ్ బొలిశెట్టి మాట్లాడుతూ.. "ప్రతీ ఒక్క స్టూడెంట్ మనసుని టీచర్ అర్థం చేసుకోవాలి. వారు సాధించే మార్కుల కంటే వారి మనసుల్ని చూడాలని, అర్థం చేసుకోవాలని ఈ మూవీని తీశాం. మా అబ్బాయి జయంత్, ఇతర ఆర్టిస్టులంతా కూడా ఎంతో సహకరించారు. ఇంత మంచి చిత్రాన్ని నిర్మించడం ఆనందంగా ఉంది. ప్రేమతో ఈ సినిమాని తీశాం. నవీన్ దేశబోయిన మాట్లాడుతూ .. "జయంత్ అండ్ ది జింగో పెన్' లాంటి చిత్రాలు చాలా అరుదుగా వస్తుంటాయి. ఇలాంటి కళాత్మక సినిమాల్ని ప్రజలు ఆదరించాలి. సినిమా అనేది ప్రభావితం చేసే మాధ్యమం. ఇలాంటి చిత్రాల్ని చూసినప్పుడు ఎంతో మంచిని గ్రహించొచ్చు. పిల్లలు, పేరెంట్స్, టీచర్స్ కలిసి ఈ మూవీని చూడాలి' అని అన్నారు. ఆశిష్ గాంధీ మాట్లాడుతూ.. "తారే జమీన్ పర్' సినిమాని గతంలో చూశాను. ఇప్పుడు దాని కంటే గొప్పగా ఉండే 'జయంత్ అండ్ ది జింగో పెన్' అనే చిత్రం రాబోతోంది. ఈ సినిమాని పిల్లలు, పేరెంట్స్ టీచర్స్ అందరూ చూడాలి' అని అన్నారు. సహ నిర్మాత షఫీ మాట్లాడుతూ .. "జయంత్ అండ్ ది జింగో పెన్' ఎంతో ఎమోషనల్గా, స్ఫూర్తినింపేలా ఉంటుంది. ఈ స్కూల్ నుంచే జయంత్ ప్రస్థానం మొదలైంది. ఈ చిత్రంలో మంచి సందేశం ఉంటుంది. పిల్లలు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చూడాల్సిన చిత్రమిది' ని అన్నారు. సత్యం రాజేష్ మాట్లాడుతూ.. "జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రంలో జయంత్ అద్భుతంగా నటించాడు. ఎంతో నేచురల్గా యాక్ట్ చేశాడు. 'జయంత్ అండ్ ది జింగో పెన్' అందరూ చూడాల్సిన సినిమా' అని అన్నారు. బేబీ ఊహా రెడ్డి మాట్లాడుతూ .. "జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమాని మేమంతా ఎంతో సరదాగా ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేశాం. ఇది చాలా మంచి చిత్రం. ఈ మూవీని పేరెంట్స్తో టీచర్స్ తో కలిసి అందరూ చూడండి' అని అన్నారు. మాస్టర్ జయంత్ మాట్లాడుతూ.. "నాకు ఈ అవకాశం ఇచ్చిన మా తల్లిదండ్రులకు థాంక్స్. మాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. యాక్టింగ్లో మెళుకువలు నేర్పిన సత్యం రాజేష్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్ అందరికీ థాంక్స్. సినిమా ఎక్కడా బోర్ కొట్టదు. అందరూ తప్పకుండా చూడండి పిల్లలు రెగ్యులర్గా ఎదుర్కొనే సమస్యలు టీచర్స్ అండ్ స్టూడెంట్స్ రిలేషన్ మరియు తల్లిదండ్రులు తాత ఎమోషన్స్ పై అద్భుతంగా ఉంటుంది' అని అన్నారు. నటుడు మానిక్ రెడ్డి మాట్లాడుతూ.. "నాకు ప్రవీణ్, నవీన్ ఇద్దరూ మంచి స్నేహితులు. ఈ చిత్రం గొప్పగా వచ్చింది. ఇందులోని థ్రిల్ మూమెంట్స్ని థియేటర్లో చూసి ఎంజాయ్ చేయాల్సిందే' అని అన్నారు.

6కొరివి" సినిమా టైటిల్ అనౌన్స్ మెంట్, గ్లింప్స్ రిలీజ్

"ఎస్ఆర్ కళ్యాణమండపం" చిత్రంతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించి..దర్శకుడిగా ప్రతిభ చాటుకున్న డైరెక్టర్ శ్రీధర్ గాదె రూపొందిస్తున్న కొత్త చిత్రానికి "కొరివి" టైటిల్ అనౌన్స్ చేశారు. శ్రీ ఐశ్వర్య లక్ష్మి మూవీస్ బ్యానర్ పై ఆది సాయి కుమార్ తో చుట్టాలబ్బాయ్ వంటి ఫ్యామిలీ మూవీ, ఆనంద్ దేవరకొండతో "హైవే" వంటి యూనిక్ థ్రిల్లర్ మూవీని నిర్మించిన ప్రొడ్యూసర్ వెంకట్ తలారి..తమ ప్రొడక్షన్ నెం.3గా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ "కొరివి" చిత్రంలో "కమిటీ కుర్రోళ్లు" మూవీ ఫేమ్ ఈశ్వర్ రాచి రాజు హీరోగా నటిస్తుండగా, నందు మురళీధర్, లిఖిత హీరోయిన్స్ గా నటిస్తున్నారు. పూజిత పొన్నాడ, సింధు కాసారం ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం "కొరివి" సినిమా శరవేగంగా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ రోజు దర్శకుడు శ్రీధర్ గాదె బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఈ చిత్రానికి "కొరివి" అనే టైటిల్ అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన టైటిల్ గ్లింప్స్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. మాయా నది ప్రాంతం లో ఉన్న నిధికి కాపు కాసే ఓ కొరివి ఆ దెయ్యం కథ ఇది.. ఈ కొరివి..బిగ్ స్క్రీన్ మీద ఆడియెన్స్ కు థ్రిల్లింగ్ ఎక్స్పీరియన్స్ ఇవ్వబోతోంది. ఈ టైటిల్ గ్లింప్స్ లో ఇంట్రెస్టింగ్ మేకింగ్ విజువల్స్ చూపించడం విశేషం. టైటిల్ అనౌన్స్ మెంట్, ఈ గ్లింప్స్ తో "కొరివి" మూవీ టీమ్ డైరెక్టర్ శ్రీధర్ గాదెకు బర్త్ డే విశెస్ తెలియజేసింది. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే ఈ యూనిక్ హారర్ మూవీని సరికొత్త కథా కథనాలతో దర్శకుడు శ్రీధర్ గాదె తెరకెక్కిస్తున్నారు.

నటీనటులు – ఈశ్వర్ రాచి రాజు, నందు మురళీధర్, లిఖిత, పూజిత పొన్నాడ, సింధు కాసారం, సురేష్ గురు, రాయల్ శ్రీ, మట్టా శివకుమార్, విహా దీకొండ, సునీత మనోహర్, అమ్మ రామచంద్రయ్య, తదితరులు.

మా పాట వాడేయడం వల్ల నష్టపోతాం: 'పర్ణశాల' నిర్మాత మంచి వెంకట్

'పర్ణశాల' సినిమాలోని 'జిమ్ జిమ్ తార' పాట చిన్న సినిమాను బతికించండి అంటూ 'పర్ణశాల' నిర్మాత ఆవేదన

'ఆదర్శ కుటుంబం'లో 15 సెకన్ల పాట వినియోగంపై అభ్యంతరం

త్వరలో ప్రేక్షకుల ముందుకు 'పర్ణశాల' సినిమా

విడుదలకు సిద్ధమవుతున్న 'పర్ణశాల' సినిమాలోని 'జిమ్ జిమ్ తార' పాటను 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో ఉపయోగించడంపై 'పర్ణశాల' నిర్మాత మంచి వెంకట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. హీరో వెంకటేష్కు సంబంధించిన ఓ సన్నివేశంలో తమ సినిమా పాటను వినియోగించారని, మా సినిమా రిలీజ్ కాకముందే ఇలా మా సినిమాలోని పాటను వాడటం చిన్న సినిమాకు అన్యాయం చేయడమే అని ఆయన పేర్కొన్నారు. చిన్న సినిమాను బతికించండి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మీడియాతో మాట్లాడిన 'పర్ణశాల' నిర్మాత మంచి వెంకట్.. ఇప్పటికే ఆదిత్య మ్యూజిక్ ద్వారా అధికారికంగా విడుదల చేసిన తమ సినిమా పాటను అనుమతి లేకుండా మరో చిత్రంలో ఉపయోగించడం వల్ల 'పర్ణశాల' సినిమాకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఇలాంటి చర్యలు చిన్న సినిమాల మనుగడకు ఇబ్బందికరంగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఒక్కసారిగా మరోసారి పర్ణశాల సినిమాలోని 'జిమ్ జిమ్ తార' పాట జనాల్లో చర్చల్లో నిలిచింది. ఎస్ఎల్టీ ఫిలిమ్స్ బ్యానర్పై మంచి వెంకట్ నిర్మిస్తున్న 'పర్ణశాల' చిత్రానికి వై.జి. భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్ కామెడీ, సస్పెన్స్ థ్రిల్లర్ అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సినిమా ప్రమోషన్లలో భాగంగా 'జిమ్ జిమ్ తార' పాటను లక్ష్మీదేవితో పాడించి చిత్ర బృందం వినూత్నంగా ప్రచారం చేపట్టింది. ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదలైన ఈ పాట ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. వినూత్న ప్రచారంతో టాలీవుడ్లో హాట్ టాపిక్గా మారిన 'పర్ణశాల' మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. నటుడు కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ .. "జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రంలో ప్రిన్సిపాల్ పాత్రను పోషించాను. నాకు నా బాల్యం గుర్తుకు వచ్చింది. దివ్యప్రవీణ్ గారు, నవీన్ గారు, మంచి సినిమాని తీశారు. నటీనటులు : మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి,